# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రజలకు ఆర్థిక తోడ్పాటును అందించడమే నిజమైన సంక్షేమమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **రాష్ట్రంలో అభివృద్ధితో పాటు, ప్రజా సంక్షేమం కూడా అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.**
3. **రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, పార్లమెంటు సభ్యులు, అధికారులు పాల్గొంటున్నారు.**
4. **వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పునః పరీక్ష ఫలితాలను జాతీయ పరీక్ష సంస్థ ఈరోజు విడుదల చేసింది**
5. **జాతీయ ఛార్టెర్డ్ అకౌంటెంట్ల దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకొంటున్నాం.**

==========================

ప్రజలకు ఆర్థిక తోడ్పాటును అందించడమే నిజమైన సంక్షేమమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన సామాజిక పింఛన్లను ప్రభుత్వం ఈ రోజు పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో లబ్దిదారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం మసీదు సెంటర్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్థులు, లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు కొత్త ప్రభుత్వంలో మొదటగా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. 1.25లక్షల మంది సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ జరుగుతోందని పేర్కొంటూ,

వాయిస్ ( సెకన్లు)

--------------------------

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు, ప్రజా సంక్షేమం కూడా అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం పర్యటనలో భాగంగా గొల్లప్రోలులో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, పిఠాపురాన్ని దేశంలో మార్గదర్శక నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లు పెంచి ఇచ్చామన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా యువతలో ప్రతిభను

ప్రోత్సహిస్తామన్నారు.పర్యావరణ శాఖను బలోపేతం చేస్తూ, కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

-------------------------

మరోవైపు.. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫించన్ పంపిణీ కార్యక్రమంలో పలువురు మంత్రులు, పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని వాంద్రాడ గ్రామంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు లబ్ధిదారులకు పింఛన్ నగదును స్వయంగా అందజేశారు. సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు చేరువచేయడంలో తమ ప్రభుత్వం ముందుంటుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నంలో లబ్ధిదారులకు మంత్రి పింఛన్‌లు పంపిణీ చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి. శ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరులోని తూర్పునాయుడుపాలెంలో మంత్రి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని హిందూపురం పార్లమెంటు సభ్యులు డి.కె.పార్థసారథి తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని ఆత్మకూరులో స్థానిక శాసనసభ్యులు పరిటాల సునీతతో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్ నగదును అందించారు. పశ్చిమగోదారి జిల్లా యలమంచిలిలోని అడవిపాలెం గ్రామంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను అందజేశారు.

ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా లబ్ధిదారులకు నాలుగువేల రూపాయల పింఛన్‌ను అందిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండలోని పాలసముద్రం గ్రామంలో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు.

రాష్ట్రంలో 65 లక్షల మందికిపైగా పింఛన్ ద్వారా లబ్ధి పొందుతున్నారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వి.ప్రభాకర్ రెడ్డితో కలసి మంత్రి పాల్గొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సిద్ధిపురంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొని పింఛన్ నగదును అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 4 వేల రూపాయల పింఛన్‌తో పాటు గత మూడు నెలలకు కలిపి 7 వేల రూపాయలను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని రాష్ట్ర హెూంశాఖ మంత్రి వి.అనిత పేర్కొన్నారు.

-------------------------

వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ 2024 పరీక్షలో గ్రేస్ మార్కులు పొందిన అభ్యర్థులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వాటిని రద్దు చేసి గత నెల 23న పునః పరీక్షను నిర్వహించారు.ఈ క్రమంలో పునః పరీక్ష ఫలితాలను జాతీయ పరీక్ష సంస్థ–ఎన్టిఏ ఈరోజు విడుదల చేసింది. దీంతోపాటు నీట్ యూజీ 2024 అభ్యర్థులందరి ర్యాంకులను సవరించినట్లు వెల్లడించింది.సవరించిన స్కోర్ కార్డులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఎన్టిఏ ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 1,563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించగా, 813 మంది మాత్రమే హాజరయ్యారని ఎన్‌టీఏ అధికారులు వెల్లడించారు.

-------------------------

అతిసార నివారణ, నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు నుంచి ఆగస్టు 31 వరకు 'స్టాప్ డయేరియా' రెండో దశ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల్లో అతిసారాన్ని నిరోధించడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు రెండు నిర్జలీకరణ ద్రావణం-ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు 14 రోజులకు సరిపడా జింక్ మాత్రలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. నిన్న నెల్లూరులో మంత్రి మాట్లాడుతూ, 2019లో తమ ప్రభుత్వ హయాంలో 5వేల 300 కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులను తీసుకువచ్చామన్నారు. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టులన్నీ పక్కన పెట్టిందన్నారు. అవన్నీ పూర్తయి ఉంటే రాష్ట్రానికి ప్రయోజనం చేకూరేదని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు రావాలని అన్నారు.

---------------------------

జాతీయ ఛార్టెర్డ్ అకౌంటెంట్ల దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకొంటున్నాం. దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్థిక వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహించడంలో ఛార్టెడ్ అకౌంటెంట్లు కీలక భూమిక పోషిస్తున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఐసిఎఐ దేశానికి చెందిన జాతీయ వృత్తిపరమైన అకౌంటింగ్ సంస్థ. దేశంలో చార్టర్డ్ అకౌంటెన్సీ వృత్తిని నియంత్రించేందుకు చార్టర్డ్ అకౌంటెంట్స్ చట్టం, 1949 కింద 1953 జూలై 1వ తేదీన దీనిని స్థాపించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా జూలై 1వ తేదీన ఛార్టెడ్ అకౌంటెంట్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

వస్తు, సేవల పన్ను-జీఎస్టీ వసూళ్లలో ఈ ఏడాది గుంటూరు కేంద్ర జీఎస్టీ కార్యాలయం 200 శాతం వృద్ధిని నమోదు చేసిందని జీఎస్టీ కమిషనర్ ఎస్. నరసింహా రెడ్డి తెలిపారు. గుంటూరు నగరంలో ఈ రోజు నిర్వహించిన ఎనిమిదవ జి.యస్.టి దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, జి.యస్.టి విధానం అమలులోకి వచ్చి, ఏడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపుతూ...

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో కార్యక్రమాల విభాగాధిపతిగా పనిచేస్తున్న బి.వెంకటేశ్వర్లు ఈరోజు విజయవాడ దూరదర్శన్ కేంద్రంలో కార్యక్రమాల విభాగాధిపతిగా అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రవికుమార్, ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.సోమేశ్వరరావు, ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి అభినందనలు తెలిపారు.

---------------------------

బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర, న్యాయ చట్టాలు ఈ రోజు నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. భారతీయ న్యాయ సంహిత ,

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే ఈ మూడు నూతన చట్టాలు దేశంలోని క్రిమినల్ న్యాయ వ్యవస్థకు అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ చట్టాలను 2023 డిసెంబర్‌లో భారత పార్లమెంటు ఆమోదించింది. అదే నెలలో ఈ మూడు చట్టాలు రాష్ట్రపతి ఆమోదం పొందినప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటి అమలును వాయిదా వేయడంతో అవి అమలులోకి రాలేదు. దేశ న్యాయ వ్యవస్థను మరింత పరిపుష్టం చేసే ఈ మూడు చట్టాలు జూలై ఒకటవ తేదీ నుండి అమలులోకి వచ్చేలా కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ మూడు రాజధానులకే కట్టుబడి ఉందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విజయనగరంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏ విధంగా 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందో తెలియడం లేదన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయాలపై జరుగుతున్న ప్రచారం సరికాదని, ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు వెళ్లి.. వాటిని పరిశీలించడం తగదని అన్నారు.

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలో పనిచేస్తున్న కార్తికేయ మిశ్రాను, రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం రాష్ట్ర సర్వీసుకు బదిలీ చేసింది.

=====================